# పెద్దల సబ్బాతుబడి పాఠములు

# పరలోకము మరియు భూమి ఐక్యపర్చబడెను ఫిలిప్పీయులకు మరియు కొలొస్సయులకు వ్రాసిన పత్రికలలో యేసును గూర్చి నేర్చుకొనుడి

## మొదటి త్రైమాసం-2026



**జనవరి, ఫిబ్రవరి, మార్చి -2026**


గ్రంథకర్త

**క్లింటన్ వాహ్ లెన్**

అనువాదం

**చింతా ప్రకాష్**

**5వ పాఠం** **జనవరి 24-30**

# రాత్రివేళ ప్రకాశించు నక్షత్రములు

**సబ్బాతు మధ్యాహ్నము** **జనవరి 24**

**ఈ వారమునకు చదువ వలసిన వచనములు : ఫిలిప్పి 2:12,13; ఫిలిప్పి 2:15,16; ఫిలిప్పి 2:17; 2తిమోతి 1:5.**

**కంఠతవచనం : "మీరు మూర్ఖమైన వక్రజనము మధ్య నిరపరాధులును నిష్కళంకులును అనింద్యులునైన దేవుని కుమారులగునట్లు, సణుగులును సంశయములును మాని సమస్త కార్యములను చేయుడి" (ఫిలిప్పీ 2:14,15).**

దేవుడు తన ధర్మశాస్త్రమునకు (ఆజ్ఞలకు) విధేయత చూపమని హెబ్రీయులకు చెప్పెను. "ఈ కట్టడలన్నిటిని మీరు గైకొని అనుసరింపవలెను. వాటిని గూర్చి విను జనముల దృష్టికి అదే మీకు జ్ఞానము. అదే మీకు వివేకము. వారు చూచి–నిశ్చయముగా ఈ గొప్ప జనము జ్ఞాన వివేచనలు గల జనమని చెప్పుకొందురు" (ద్వితియో 4:6).

కొన్ని వందల సంవత్సరముల తరువాత యేసు ఈవిధముగా చెప్పెను. "మీరు లోకమునకు వెలుగైయున్నారు. కొండ మీదనుండు పట్టణము మరుగైయుండనేరదు" (మత్తయి 5:14).

"మనము దేవుని వెలుగును ఏవిధముగా చూపించగలము? యేసుతో మనము అనుదినము జీవించవలసి యున్నది. ఆయనే నిజమైన వెలుగు. ప్రతి మనిషికి వెలుగును ఇచ్చువాడు యేసే" (యోహాను 1:9; యోహాను 8:12 మరియు ఫిలిప్పి 2:9–11 కూడా చదువుడి).

యేసు తన వెలుగును ప్రతి ఒక్కరికి అనుగ్రహించును. అయితే మన జీవితములను ఆయనకు సమర్పించుకొనవలెను. అందువలననే ఫిలిప్పీయులకు పౌలు వ్రాసిన పత్రికలోని మాటలు నేడు మనందరికి ఎంతో ప్రాముఖ్యమైనవి.

– జనవరి 1 సబ్బాతు దినమున ఈ వారమునకు ఏర్పాటు చేయబడిన సబ్బాతుబడి పాఠమును అధ్యయనము చేయుటకు సిద్ధపడుడి.

**ఆదివారం** **జనవరి 25**

## దేవుడు మన హృదయములో జీవించే విధముగాను, మన జీవితాలలో పనిచేసే విధముగా అనుమతించుము (ఫిలిప్పీ 2:12,13)

యేసు మనకు పరిపూర్ణమైన మాదిరియని పౌలు పేర్కొనుచున్నాడు. యేసుకు తన హృదయములో గర్వము లేదు. ఆయన జీవితమునకు దేవుని యొక్క ప్రణాళిక ఏమైయున్నదో దానికి ఆయన విధేయుడైయుండెను. యేసును గూర్చిన శుభవార్తను విన్న తరువాత

ఫిలిప్పీయులు దేవునికి విధేయులై జీవించినందుకు పౌలు వారిని కొనియాడెను (అపో.కా. 16:13-15, 32,33). వారిని నిరంతరము దేవునికి విధేయులై యుండమని పౌలు వారిని ప్రోత్సహించెను.

ఇప్పుడు మనము ఏవిధముగా యేసు యొక్క మాదిరిని అనుసరించి నడుచుకొనుచున్నామో పౌలు మనవైపు చూస్తున్నాడు. యేసు మనలను ఏవిధముగా రక్షిస్తాడో సిలువ మనకు ఏమి బోధిస్తున్నదో పౌలు పరిశీలిస్తున్నాడు.

**దేవుడు నిన్ను రక్షించెను. అది నిజమని మనము చూపించే రీతిలో ఎల్లప్పుడు జీవించాలి అని పౌలు చెప్పిన మాటల యొక్క భావము ఏమిటి? (ఫిలిప్పీ 2:12; 13 కూడా జవాబు కొరకు చదువుడి).**

ఫిలిప్పీ 2:12,13లో శుభవార్తను గూర్చి పౌలు వేరొక నూతన బోధను అనుగ్రహించలేదు. ఫిలిప్పీయులకు వ్రాసిన పత్రికలో పేర్కొనిన శుభవార్త రోమీయులకు వ్రాసిన పత్రికలోను, ఇతర పత్రికలలోను పేర్కొన్న శుభవార్త ఒక్కటే. ఒకరికి ఒక విధముగాను, వేరొకరికి వేరొక విధముగాను వ్రాయలేదు. బైబిలులో మనము ఒక అంశమును గూర్చి చదివేటప్పుడు ఒక ప్రాముఖ్య నియమమును ఒకదానిని పాటించవలెను. ఆ అంశమును గూర్చి బైబిలు ఏమి చెప్పుచున్నదో దానినంతటిని చదువవలసి యున్నది. "దేవుడు మనలను ఏవిధముగా రక్షించును" అనునది ఈ వారము మనము చదువ వలసిన అంశము. ఈ అంశమును చాలా సులువుగా అపార్థము చేసుకొనుటకు వీలున్నది. అందుచేత మనమొక అంశమును చదువుచున్నపుడు దానిని గ్రహించుటకు కష్టమైనచో ఈ ప్రాముఖ్యమైన నియమమును అనుసరించుటకు జ్ఞాపకముంచుకోవాలి. ఈ నియమము ఆ విషయాన్ని అర్ధము చేసుకొనుటకు మనకు సహాయపడును.

**రోమా 3:23,24; రోమా 5:8; ఎఫెసి 2:8-10 చదువుడి. దేవుడు మనలను ఏవిధముగా రక్షిస్తున్నాడు అనే అంశమును గూర్చి ఈ వాక్యాలు ఏమి బోధిస్తున్నవి?**

దేవుడు మనలను తన ప్రేమతోను, క్షమించుట ద్వారా రక్షించుచున్నాడు. అందులో అనుమానములేదు. మనంతట మనము రక్షించుకొనలేము. మన ప్రవర్తన రక్షించలేదు. చివరికి విశ్వాసము కూడా ఒక వరమే. పరిశుద్ధాత్మ మన హృదయములలో పని చేసినపుడు ఆ వరము మనకు అనుగ్రహింపబడును. దేవుని నమ్ముటకు పరిశుద్ధాత్మ సహాయము చేయును. దేవుడు నూతన హృదయము అనుగ్రహించినపుడు మన ప్రవర్తన మార్చుకొనగల్గుదుము. ఆయన ధర్మశాస్త్రమునకు విధేయులమై యుందుము. న్యాయమైన దానిని చేయుటకు తీర్మానించుకొనుటకు దేవుని ఆత్మ సహాయపడును. పాపము చేయకుండా తిరస్కరించుటకు పరిశుద్ధాత్మ సహాయపడును.

దేవుడు మన హృదయాల్లో జీవించుటకు అనుమతిస్తే మన జీవితాలను మార్చి వేయును. అంతట భయముతోను వణుకుతోను దేవునికి విధేయత చూపగలము. (ఫిలిప్పీ 2:12) దేవుడంటే భయపడాలని ఫిలిప్పీ 2:12 చెప్పుటలేదా? మన కొరకు దేవుడు మనతో ఉన్నాడని గుర్తుంచుకోవాలి. మనలను ఎల్లప్పుడు కావలి కాయుచున్నాడు. అందుచే భయముతో దేవునికి విధేయులమై జీవించాలి. (కీర్తన 2:11 చదువుడి.)

**సోమవారం** **జనవరి 26**

## రాత్రివేళ ప్రకాశించు నక్షత్రములు (ఫిలిప్పీ 2:15,16)

ఫిలిప్పీ 2:14లో ఫిలిప్పీయులనుద్దేశించి పౌలు కొన్ని సలహాలనిచ్చెను. “మీరు మూర్ఖమైన వక్రజనము మధ్య నిరపరాధులును, నిష్కళంకులును అనింద్యులునైన దేవుని కుమారులగునట్లు సణుగులును సంశయములు మాని సమస్త కార్యములను చేయుడి” (ఫిలిప్పీ 2:15).

మనము రాత్రి సమయములో పట్టణాల నుండి మరియు వీధిదీపముల నుండి దూరముగా వెళ్ళి ఆకాశమువైపు చూచినయెడల చాలా స్పష్టముగా మనకు నక్షత్రాలు కనిపిస్తాయి. చీకటిగా ఉన్న ఆకాశము నక్షత్రాలను చాలా ప్రకాశవంతముగా కనిపించేటట్లు చేస్తుంది. మన జీవితాలలో కూడా ఆవిధముగానే సంభవిస్తుంది. మన చుట్టూ ఉన్న పాపము చాలా బలముగా ఉన్నపుడు, ప్రకాశించే నక్షత్రమువలె కనిపిస్తాము. దేవుని ఎరుగని మన చుట్టూ ఉన్న ఇతర ప్రజల మధ్యన మనము వేరుగా ఉన్నట్లు చూడగలుగుతాము.

మనము దేవుని బిడ్డలముగా ఏమి చేయవలెనని పౌలు చెప్పుచున్నాడు? జవాబు కొరకు ఫిలిప్పీ 2:15,16 చదువుడి. దేవుని బిడ్డలుగా పవిత్రమైన జీవితాలను జీవించాలి. అప్పుడు మనము ఏ విషయములోను అపరాధులుగా ఉండము (ఫిలిప్పీ 2:15)లో యోబు ఆవిధముగానే జీవించెను (యోబు 1:1,8; యోబు 2:3, యోబు 11:4; యోబు 33:9 కూడా చదువుడి). నిరపరాధియైన ఒక మనుష్యుడు పవిత్ర హృదయమును కలిగియుంటాడు. అటువంటి వ్యక్తి ఇతరులనెవ్వరిని గాయపర్చడు. అందువలననే యేసు మనలను ఈలాగు అడుగుచున్నాడు. “ఇదిగో తోడేళ్ళ మధ్యకు గొఱ్ఱెలను పంపినట్లు నేను మిమ్మును పంపుచున్నాను గనుక పాములవలె వివేకులును పావురములవలె నిష్కపటులునైయుండుడి” (మత్తయి 10:16) పౌలు కూడా ఈ విధముగా చెప్పాడు. “మీ విధేయత అందరికి ప్రచురమైనది గనుక మిమ్మును గూర్చి సంతోషించుచున్నాను. మీరు మేలు విషయమై జ్ఞానులును కీడు విషయమై “నిష్కపటులునై యుండవలెను” (రోమా 11:19) మన ఈ కాలము నాటి నవీన వార్తా కార్యక్రమములలో తరచుగ భయంకరమైన వృత్తాంతములను ప్రచురిస్తూ ఉంటారు. అందుచేత నేడు దావీదు ఇచ్చిన హెచ్చరికను అనుసరించుట చాలా ప్రాముఖ్యము. “నా కన్నుల యెదుట నేను ఏ దుష్కార్యమును ఉంచుకొనను. భక్తి మార్గము తొలగిన వారి క్రియలు నాకు అసహ్యములు అవి నాకు అంటనియ్యను” (కీర్తన 101:3).

దేవుని ప్రజలముగా ఇతర మనుష్యుల కన్నా వేరుగా కనిపిస్తాము. పాపపు విషయములనుండి మన విశ్వాసము వేరు చేయును. అంధకారములో మనము ప్రకాశించే నక్షత్రమువలె ప్రకాశించవలెను (ఫిలిప్పీ 2:15) ఆవిధముగా మనము ప్రకాశించుటకు పాపమును తిరస్కరించాలి. అదే మనముందున్న ఏకైక మార్గము (రోమా 12:2) దేవుని వాక్యమైన బైబిలు గ్రంథమునకు విధేయులమై జీవించాలి. (ఫిలిప్పీ 2:16) మనము ఎన్నిక చేసుకొనే జీవిత విధానములు మనము యేసు కొరకు జీవిస్తున్నామా లేక ఈ లోక

సంబంధమైన ఈ జీవితము కొరకే జీవిస్తున్నామా అని ఈ రెండింటిలో ఏదో ఒకటి చూపిస్తాయి. (ఫిలిప్పీ 2:16ను కొరింథీ 9:24-27తో పోల్చి చూడుడి.

**ఇప్పుడు మీ జీవితములో ఏ భాగములు "మురికిగా ఉన్నవి?" మీరు పవిత్రముగా ఉండుటకు ఏమి చేయవలెను?**

**మంగళవారం** **జనవరి 27**

## ఒక సజీవమైన బలియాగము (ఫిలిప్పీ 2:17)

**ఫిలిప్పీ 2:17; 2తిమోతి 4:6; రోమా 11:12 మరియు 1కొరింథి 11:1 చదువుడి. ఈ వాక్యములు మనకు ఏమి బోధించుచున్నవి?**

యేసు కొరకు మరణించుటకు పౌలు ఎన్నడూ భయపడలేదని ముందుగానే చెప్పాడు (ఫిలిప్పీ 1:20-23) ఇపుడు పౌలు ఈలాగు చెప్పాడు (ఫిలిప్పీ 2:17) "మరియు మీ విశ్వాస యాగములోను, దాని సంబంధమైన సేవలోను నేను పానార్పణముగా పోయబడినను నేనానందించి మీయందరితో కూడ సంతోషింతును" ఈ చిహ్నము అనగా పానార్పణముగా పోయబడుట అనునది పాత నిబంధన కాలము నుండి వచ్చుచున్నది. దేవుని ప్రజలు తైలమును ద్రాక్షారసమును లేక నీటిని దేవునికి అర్పణముగా అర్పించేవారు (ఆది కాం. 35:14, నిర్గమ 29:40 మరియు 2 సమూయేలు 23:15-17 చదువుడి) ఈ అర్పణను నూతన నిబంధనలో "మరియ" యేసునికి చేసిన కార్యమును గుర్తు చేసుకొనుటకు మనకు సహాయపడును. యేసు యొక్క తలమీదను, ఆయన పాదముల మీదను బహు విలువైన అత్తరును పోసెను. (మార్కు 14:3-9; యోహాను 12:3) అవును మరియ యేసుకు ఇచ్చిన బహుమానము నిజమైన పానార్పణము కాదు. అయితే ఆమె ఇచ్చిన బహుమానము ద్వారా ఆమె యేసును ఎంతగా ప్రేమించినదో మనకు చూపించుచున్నది. కాబట్టి మన పాపముల కొరకు సిలువ మీద యేసు చేసిన బలియాగమునకు సూచనగా మరియ యొక్క బహుమానము పరిపూర్ణమైన చిహ్నముగా నిలిచెను.

పౌలు దేవుని కొరకు పనిచేయుచున్నాడు కాబట్టి ఆ పనిని బట్టి ఆయనకు మరణము సంప్రాప్తమైనను దానిని అంగీకరించుటకు స్థిరముగా ఉన్నాడు. దేవుని కొరకు పౌలు తన జీవితమును అర్పించెను. అదొక ప్రత్యేకమైన అర్పణముగా పరిగణింపబడెను. పాత నిబంధన కాలములో దేవుని ప్రజలు పానార్పణముతో పాటు ఇతర అర్పణలు కూడా చెల్లించే వారు (సంఖ్యా 15:1-10; సంఖ్యా 28:1-15) అందుచేత పౌలు జీవితము పానార్పణము వంటిది. అది ఫిలిప్పీలోని విశ్వాసులు అర్పించుచున్న ఇతర అర్పణములకు జత చేయబడినది. వారి జీవితములనే వారు దేవునికి అర్పణములుగా అర్పించిరి. ఫిలిప్పీయులు వారి జీవితమంతటిని దేవునిని సేవించుటకు అర్పించిరి. వారి అర్పణము ఒక సజీవ యాగమునకు సమానమైనది (రోమా 12:1).

ఆదిమ క్రైస్తవులు ఒక్కొక్క గృహమును దర్శించి వారి విశ్వాసమును పంచుకున్నారు (అపొ.కా. 5:42) శుభవార్తను వినుటకు ఆసక్తిని కనుపరచిన ప్రతి వారికి దానిని వినిపించిరి. బైబిలు అధ్యయనము చేయుటకు అనేకమంది ఇతర ప్రజలను వారి గృహములకు ఆహ్వానించేవారు. (అపొ.కా. 12:12; 1కొరింథి 16:19; కొలస్స 4:15; ఫిలేమోను 1:1,2) వారు నమ్మిన విశ్వాస సూత్రములకు సరియైన కారణాలను వారికి చూపించేవారు. (అపొ.కా. 17:11; 18:26; 1పేతురు 3:15) మన తొలి ఎడ్వంటిస్టు క్రైస్తవ సంఘ సభ్యులు కూడా వారివలెనె దేవుని వాక్యమును ఇతరులతో కలిసి చదివి బోధించేవారు. మన తొలి సంఘ సభ్యులు పొరుగు వారితో శుభవార్తను పంచుకొనేవారు. విశ్వాసమును పంచుకొనేవారు. ఇతరులకు బైబిలు బోధన తరగతులను నిర్వహించేవారు. దైవ సేవకుడైన పాదిరిగారు వారిని దర్శించి, బాప్తిస్మమిచ్చుటకు సిద్దపర్చేవారు. క్లుప్తముగా చెప్పాలంటే మన తొలి ఎడ్వంటిస్టు సభ్యులు సజీవయాగముగా పనిచేసారు. వారేమి చేసారో దానిని మనము అనుసరించలేమా?

**బుధవారం** **జనవరి 28**

## తిమోతి ఒక సత్ప్రవర్తన గల మనిషిగా తనను తాను నిరూపించుకొనెను (2వ తిమోతి 1:5)

పౌలుకు తిమోతి సహాయపడెనని మనకు ముందుగానే తెలియపర్చెను. తిమోతి ద్వారానే పౌలు ఫిలిప్పీయులకు వ్రాసిన పత్రికను పంపెను (ఫిలిప్పీ 1:1) పౌలుకు తన పనిలో తిమోతి ఎంతగానో సహాయపడెనని ఇప్పుడు మనకు చెప్పుచున్నాడు. తిమోతి యేసును గూర్చిన శు భవార్తను అనేక పట్టణములలోను, అనేక స్థలములలోను బోధించెను (2తిమోతి 4:5) పౌలు తిమోతిని మాసిదోనియాకు పంపించెను (1థెస్సలో 3:2; అపొ.కా. 18:5 మరియు అపొ.కా. 19:22తో పోల్చి చూడుడి). పౌలు అనేక సందర్భములలో తిమోతిని కొరింథి పట్టణానికి పంపెను (1కొరింథి 16:10) పౌలు మరియు సీలతో తిమోతి కొరింథిలో పనిచేసెను (1థెస్స 1:1; 2 థెస్స 1:1) అటు తరువాత పౌలు సీలలు ఎఫెసి పట్టణములలో పనిచేసెను. తిమోతిని గూర్చి పౌలు ఈవిధముగా సాక్ష్యమిచ్చెను. "మీ క్షేమ విషయమై నిజముగా చింతించువాడు అతని వంటివాడెవడును నా యొద్ద లేడు" (ఫిలిప్పీ 2:20) అనేక విషయాలలో తిమోతి కూడా పౌలు వంటివాడే. తిమోతి యేసును ప్రేమించెను. ప్రజలకు యేసును గూర్చిన శుభవార్తను ప్రకటించుటలో ఎంతో కష్టపడి పనిచేసెను. ఫిలిప్పీయుల విషయమై వారి బాగోగులను గూర్చి ప్రయాసపడ్డాడు.

**పౌలు తిమోతిని గూర్చిన అనేకమైన విషయాలు ఎందుకు చెప్పాడని మీరనుకుంటున్నారు? జవాబు కొరకు ఫిలిప్పీ 2:19-23 చదువుడి. ఇంకా పౌలు తిమోతిని గూర్చి ఏమి చెప్పెను? జవాబు కొరకు 1 కొరింథి 4:17 మరియు 2 తిమోతి 1:5 చదువుడి).**

పౌలు తిమోతిని గూర్చి ఇంకా ఈవిధముగా చెప్పెను. "అతని యోగ్యత మీరెరుగుదురు. తండ్రికి కుమారుడేలాగు సేవ చేయునో ఆలాగే అతడు నాతో కూడా సువార్త వ్యాపకము

నిమిత్తము సేవ చేసెను" (ఫిలిప్పీ 2:22) తిమోతి నమ్మదగిన విశ్వాసి అని పౌలుకు నిరూపించుకున్నాడు. అనేక సమయాలలో తిమోతి ఎంత కష్టపడి పనిచేసెనో పౌలు చూచెను. అందుచేత తిమోతి మీద ఏ పనికైనను ఆధారపడవచ్చునని పౌలుకు తెలుసు (2కొరింథి 2:9; 2కొరింథి 9:13).

జీవితములో ఎదురయ్యే కష్టసమయాలు ఒక పరీక్ష వంటిది. మన ఈ అనుభవాలను ఇతరులు చూచి, మనము ఎవరమైయున్నామని తెలుసుకొనుటయే గాక, మన హృదయాలలో ఏమి ఉన్నదో కూడా వారు గ్రహించగలుగుదురు. ఎలెన్ జి వైట్ ఈ విధముగా చెప్పెను. కఠిన పరీక్షల వంటి అనుభవాలు మనకు కలుగును. కొన్ని అనుభవాలను మనలను కోపోద్రేకులనుగా చేయును. అట్టి సందర్భములో మనము చింతించకూడదు. మన కోపమును వ్యక్తపర్చకూడదు. క్షమాబుద్ధిని ప్రదర్శించినట్లయితే, ప్రేమను కనుపర్చినట్లయితే మన హృదయాలతో మనము కూడా యేసువలె ఉందుము. అందువలన మనలను ఎవరైనా అవమానపర్చినచో, మనోభావములను గాయపర్చినచో మన సహనమును కోల్పోకూడదు. వారికి ప్రేమ పూర్వకమైన మాటలతో మనము జవాబివ్వవలెను. మన యెడల హీనముగా ప్రవర్తించిన వారికి మన ప్రేమతో కూడిన సహవాసమును అందించాలి. అప్పుడు యేసు యొక్క ఆత్మ మన హృదయాలలో నివసించుచున్నదని ప్రతి ఒక్కరికి మనము చూపగలుగుదుము" –ఎలెన్ జి వైట్, సంఘమునకు సాక్ష్యములు, సంపుటి 5, పుట 344.

**మిమ్ములను గాయపరచే కొన్ని విషయాలను గూర్చి ఆలోచించుకో, ఆ పరిస్థితులలో మీకు కోపము వచ్చిందా? లేక మీరు సహనము చూపించి సంతోషముగా ఉన్నారా? యేసు వలె జీవించుటకు మీరెదుర్కొనిన కష్టసమయాలు ఏమి బోధించాయి?**

## గురువారం — జనవరి 29

## ఎపఫ్రొదితు వంటి ప్రజలను గౌరవించుడి (ఫిలిప్పీ 2:25-30)

**ఎపఫ్రొదితును గూర్చి పౌలు ఏమి చెప్పెను? అతడొక బలమైన క్రైస్తవ పనివాడని చూపించుటకు ఎపఫ్రొదితు ఏమి చేసెను? జవాబు కొరకు ఫిలిప్పీ 2:25–30 చదువుడి.**

పౌలు ఎపఫ్రొదితును గూర్చి ఫిలిప్పీయులకు వ్రాసిన పత్రికలోనే తప్పవేరే చోట ఎక్కడ అతనిని గూర్చి మాట్లాడలేదు. పౌలు యొక్క మాటల ద్వారా ఎన్నో విషయాలు నేర్చుకున్న ఎపఫ్రొదితు అనే ఒక గ్రీకు స్త్రీ జాతికి చెందిన దేవత పేరు యొక్క గౌరవార్థమై అతనికి ఆ పేరు పెట్టబడెను. అతని పేరును బట్టి మనము గమనించినట్లయితే అతడు క్రైస్తవ మతమును స్వీకరించకపూర్వము అతడు అబద్ధ దేవుళ్ళను, దేవతలను ఆరాధించేవాడు. ఎపఫ్రొదితు పౌలుతో కలిసి పనిచేసినట్లు మనము గ్రహించగలము. వారిరువురు కలిసి ఫిలిప్పీ పట్టణములో పనిచేసియుండవచ్చును. ఫిలిప్పీ 1:25లో పౌలు ఎపఫ్రొదితును ఒక సైనికునితో పోల్చెను. యేసును గూర్చిన శుభవార్తను బోధించుటలోను, ప్రచారము చేయుటలోను అతడు బాగుగా కష్టపడి పనిచేసి యుండవచ్చును. 27 వచనముతో పోల్చి చదువుడి. కొన్ని సమయాలలో

కొన్ని ప్రాణాపాయకరమైన పరిస్థితులను ఎపఫ్రోదితు ఎదుర్కొనెను. ఆవిధముగా అతడు సిపాయిగా పోల్చబడెను. ప్రభువైన యేసు కొరకు మరణించుటకు కూడా అతడు భయపడలేదు (ఫిలిప్పీ 2:30).

ఫిలిప్పీలో ఉన్న సంఘము, పౌలు యొద్దకు ఒక వార్తాహరుని పంపించాలనుకున్నప్పుడు వారు ఎపఫ్రోదితును ఎన్నిక చేసుకున్నారు. పౌలు చెరసాలలో బంధింపబడియున్నపుడు ఆయనను ఎపఫ్రోదితు వెళ్ళి దర్శించెను. పౌలు యొక్క అవసరములను తీర్చేవాడు (ఫిలిప్పీ 2:25) పౌలుకు ధన సహాయము చేసి రమ్మని ఫిలిప్పీయులు డబ్బును ఎపఫ్రోదితుకు ఇచ్చి పంపేవారు (ఫిలిప్పీ 4:18). ఆవిధముగా అప్పుడప్పుడు ధన సహాయము చేయుట చాలా ముఖ్య విషయము. రోము చెరసాలలో ఉన్న వారె సమకూర్చుకోవాలి. ఆ విధంగా జైలులో ఉన్న ఖైదీలు వారి కుటుంబ సభ్యుల మీద, ఇతర స్నేహితుల మీద ఆధారపడవలసి వచ్చెను (అపొ.కా. 24:23తో పోల్చి చూడుడి). రోమా చెరసాలలో రెండవసారి ఉన్నపుడు చివరి దినములలో పౌలు, శీతాకాలము రాకముందే తిమోతిని తన యొద్దకు రమ్మని పిలిచెను. తిమోతి వచ్చేటప్పుడు అతని యొద్ద పౌలు విడిచి పెట్టి వచ్చిన దట్టమైన ఉన్ని దుస్తులను జైలులో ఉన్న తనకు అందించమని పౌలు చెప్పెను. పౌలు తాను వ్రాసిన ఉత్తరమును ఫిలిప్పీయులకు తీసుకొని వెళ్ళమని ఎపఫ్రోదితుకు చెప్పెను. –ఎలెన్ జి వైట్, అపొ.కా. పుట 479 చదువుడి.

ఫిలిప్పీలో ఉన్న క్రైస్తవ సంఘములో కొన్ని సమస్యలు వచ్చినవి. (సబ్బాతుబడి 4వ పాఠం చదువుడి). ఎపఫ్రోదితు ఊహించిన దానికంటే ముందుగానే అతడు ఫిలిప్పీ సంఘమునకు తిరిగి వెళ్ళెను. ఎపఫ్రోదితును ఆహ్వానించమని ఫిలిప్పీయులకు చెప్పెను. అతడు యేసు మాదిరిని అనుసరించి జీవిస్తున్నాడు కావున గౌరవించమనెను (ఫిలిప్పీ 2:29; ఫిలిప్పీ 2:6–11,30; లూకా 22:25–27తో పోల్చుడి). గౌరవించవలెను అనే గ్రీకు పదము 1. రోమా సైనికుని (లూకా 7:2) 2. విందుకు ఆహ్వానించబడినవారు (లూకా 14:8) 3.యేసు కొరకు (1పేతురు 2:4,6) ఎపఫ్రోదితుకు ప్రత్యేక గౌరవము ఇవ్వమని పౌలు అడిగెను. అతడు ప్రభువు కొరకు ప్రయాసపడెను.

**శుక్రవారం** **జనవరి 30**

## అదనపు అధ్యయనము

ప్రతి మానవునికి చివరి పరీక్షను దేవుడు త్వరలో ఇవ్వనైయున్నాడు. ఆ సమయము త్వరలో రానైయున్నది. మనుష్యులు మనలను మృగము యొక్క ముద్రను అంగీకరించమని బలవంతము చేసే రోజులు త్వరలో రానైయున్నవి. బలహీనులైన ప్రజలు, వారిని బలవంతము చేసే నాయకులకు విధేయత చూపుదురు. వారు మృగము యొక్క ముద్రను స్వీకరిస్తారు. కొంచెముకొంచెముగా ఈ గుంపునకు చెందిన ప్రజలు మానవులయొక్క అభిప్రాయాలను, భావములను, నియమాలను అంగీకరిస్తారు. ఈ గుంపునకు చెందిన ప్రజలే

అవమానములకు, చెరసాలకు, మరణానికి భయపడుదురు. అందుచేత వారు సులువుగానే మృగము యొక్క ముద్రను అంగీకరిస్తారు.

ఆ సమయములో ఎవరు నిజముగా యేసును సేవిస్తారో మనము చూడగలుగుదుము. యేసును నిజముగా వెంబడించేవారు ఆయనతో నిలబడగలుగుదురు. గతములో అనేకమంది అనుచరులు దేవుని కొరకు బలముగా నిలువబడుటకు భయపడేవారు. వారికి ధైర్యముండదు. ఇప్పుడైతే వారు యేసు పక్షముననే ఉన్నారు. ఆయన సత్యమునే అనుసరిస్తున్నామని చెప్పుకొందురు. బహు బలహీనముగానే, సభ్యులు రాజైన దావీదువలె ధైర్యమును తెచ్చుకుంటారు. వారు దేవునిని పరిపూర్ణముగా ఆరాధించి, సేవ చేస్తారు. ఎక్కువ భయంకరమైన పరిస్థితులు దేవుని ప్రజలకు సంభవించినపుడు వారు మరింత ఎక్కువగా నక్షత్రములవలె ప్రకాశిస్తారు. సాతానుడు వారి మీద దాడి చేసి వారిని గాయపరచును. అయితే యేసు నామములో దేవునికి విధేయులైన విశ్వాసులు ఎదుర్కొనే పోరాటమును జయిస్తారు. –ఎలెన్ జి వైట్, సంఘమునకు సాక్ష్యములు, సంపుటి 5, పుట 81, 82.

## చర్చించుకొనుటకు ప్రశ్నలు

1. ఇక్కడ దృష్టాంతముగా చెప్పబడిన వాక్యాలలో కొద్దికొద్దిగా మానవ భావాలను నియమములను అనుసరించే వారిని గూర్చి మాట్లాడుతూ మానవుని ఎటువంటి భావాలు అని నీవనుకొనుచున్నావు? ఈ వాక్యానికి మొత్తం సంఘం ఏవిధంగా వర్తిస్తుంది? అటువంటి ప్రజలను గూర్చి ఆలోచించండి.

2. దేవుడు ఈ విధముగా చెప్పెను : నన్ను ఘనపరచువారిని ఘనపరతును (1సమూయేలు 2:30) మనం ఏవిధముగా దేవునిని ఘనపరచుచున్నాము? దేవునిని ఘనపరచుట అంటే ఆయనకు మహిమ చెల్లించుట లేక స్తుతులు చెల్లించుట అని అర్దమా (ప్రకటన 14:7) మీ జవాబును వివరించుడి.

3. పౌలు ఈవిధంగా వ్రాసెను : “కాగా ప్రియులారా, మీరెల్లప్పుడును విధేయులైయున్న ప్రకారము, నా యెదుట ఉన్నప్పుడు మాత్రమే గాక మరి ఎక్కువగా నేను మీతో లేని యీా కాలమందును భయముతోను వణకుతోను మీ సొంత రక్షణను కొనసాగించుకొనుడి (ఫిలిప్పీ 2:12) మనము మంచి ప్రవర్తన ద్వారా దేవుని ప్రేమ, క్షమాపణను సంపాదించుకొనడమంటే దేవుని కొరకు జీవించుట అని అర్థమా? మీ జవాబుకు కొన్ని కారణాలు చూపెట్టుడి.

❈✶❈